# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 21 డిసెంబర్ : 2018 విడుదల : 4

**సీయోను నివాసులారా**

**నేను వచ్చి**

**మీమధ్యను నివాసముచేతును**

**సంతోషముగానుండి**

**పాటలు పాడుడి**

**జెకర్యా 2:10**

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

డిసెంబర్ - 2018

సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.100/-

## విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-4 |
| 2. | కుమారుని ముద్దుపెట్టుకొనుడి | 5-7 |
| 3. | ఫ్లోరెన్స్ నైటింగేల్ | 8-9 |
| 4. | శ్రద్ధ - ఐశ్వర్యము | 10 |
| 5. | సువార్త ఉజ్జీవ సభలు | 11 |
| 6. | నీకు విరోధముగా లేచువారు | 12-18 |
| 7. | పరులజోలికి పోకుండుట | 19 |

# ఎడిటర్ అర్పణ

**మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి**
**నా హృదయపూర్వక క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు.**

**"రాజైన హేరోదు దినములయందు యూదయదేశపు బేత్లెహేములో యేసు పుట్టిన పిమ్మట తూర్పుదేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి, యూదుల రాజుగా పుట్టినవాడెక్కడనున్నాడు? అని హేరోదు రాజును అడిగిరి. రాజు ఈ సంగతి వినినప్పుడు అతడును అతనితో ఉన్న యెరూషలేమువారందరును కలవరపడిరి. రాజు ఆ జ్ఞానులను రహస్యముగా పిలిపించి – మీరు వెళ్లి ఆ శిశువు విషయమై జాగ్రత్తగా విచారించి తెలిసికొని నాకు వర్తమానము తెండని చెప్పి ఆ జ్ఞానులను బేత్లెహేమునకు పంపివేసెను" మత్తయి 2:1-8.**

రాజైన హేరోదు దినములలో యూదయ దేశపు బేత్లెహేములో యేసుక్రీస్తు జన్మించెను. ఆయనను చూచుటకు బయలుదేరిన తూర్పుదేశపు జ్ఞానులు నక్షత్రమును ఆధారముగా చేసుకొని దైవచిత్తానుసారముగా ప్రయాణమును కొనసాగించిరి అయితే వారు మార్గమధ్యములో హేరోదు రాజును కలిసికొనిరి. దేవుని దూత హేరోదు రాజును కలుసుకొనమని జ్ఞానులకు తెలియజేయలేదు కాని యేసుప్రభువు యూదుల రాజు గనుక రాజుల విషయం రాజులకు తెలుస్తుందని జ్ఞానులు ఆలోచనచేసి హేరోదు రాజును కలుసుకొన్నారు. వారి జ్ఞానము ఆత్మీయ యాత్రలో ఈ లోకపు రాజునొద్దకు నడిపినది. **"జ్ఞానుల జ్ఞానమును నాశనము చేతును వివేకుల వివేకమును శూన్యపరతును" 1కొరింథీ.1:19.** జ్ఞానులకు కలిగిన ఆలోచన వలన వారి ప్రయాణం ప్రభువును కలిసికొనుటకు ఆలస్యమైనది. క్రీస్తు ప్రభువు జననం ఎవరికైతే బయలుపరచబడలేదో వారికి ఈ జ్ఞానులు బయలుపరచిరి. అంతమాత్రమే కాక మరెన్నడు హేరోదును కలుసుకొనే అవకాశం వారికి లేదు. మన ఆలోచనలతో ప్రయాణంచేసే మార్గం ఒక్కసారే ఉంటుంది. ఆ తరువాత ద్వారములు మూయబడును.

హేరోదు రాజు వారితో మీరు వెళ్లి ఆ శిశువు విషయమై వివరముగా తెలిసికొని నాకును తెలియజేయుడి నేనును వెళ్లి ఆయనను పూజింతునని దుష్టఆలోచన చెప్పెను. హేరోదు రాజు క్రీస్తును పూజిస్తానని చెప్పిన ఆలోచన

హృదయములోనుండి వచ్చినది కాదు. తత్ఫలితముగా జ్ఞానులు యేసుప్రభువును ఆరాధించిన తరువాత వేరొక మార్గమున ప్రయాణము చేయవలెనని దేవునిచేత బోధించబడి వారు వచ్చిన మార్గమున వెళ్ళక వేరొక త్రోవలో తమ దేశమునకు తిరిగి వెళ్ళిరి.

ఆ జ్ఞానులు వేరొక మార్గమున తిరిగి వెళ్ళి తనను అపహసించిరని హేరోదు గ్రహించి బహు ఆగ్రహము తెచ్చుకొని, క్రీస్తు పుట్టిన కాలమునుబట్టి బేత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను 2 సం॥ల లోపు వయస్సుగల మగ పిల్లలందరిని వధించెను. రామాలో అంగలార్పు వినబడెను ఏడ్పును మహారోధన ధ్వనియు కలిగెను మత్తయి 2:17. జ్ఞానులు వారి ఆలోచనలతో నడుచుట వలన ఎంతో నష్టము జరిగినది. జ్ఞానులు నక్షత్రమునే ఆధారం చేసికొని ముందుకుసాగి క్రీస్తును దర్శించినట్లయితే ప్రపంచానికి సాక్షులుగా వుండేవారు. ఆయన నక్షత్రమును చూచుట మాని తమ స్వంత ఆలోచనతో రాజగృహాన్ని చేరారు దానిని బట్టి ఎంతో నష్టమునకు కారకులుగా చరిత్రలో మిగిలిపోయారు.

ప్రియమైన దేవుని బిడ్డా! నీ జీవితములో కూడా జ్ఞానులవలె ఒక ఉన్నతమైన ఉద్దేశంతో నీ ఆత్మీయ ప్రయాణాన్ని ప్రారంభించియుండవచ్చు కాని మార్గమధ్యములో నీ దిశ మారినదా! ఎన్నో క్రిస్మస్‌లు, నూతన సంవత్సర ఆరాధనలు గతించిపోవుచున్నవి కాని దైవచిత్తానుసారమైన మార్గములోనే అడుగులు వేయక ఇప్పటివరకు వేరొక మార్గములో నీవు ప్రయాణించినను నీ మార్గమును దేవుని చిత్తానుసారమైన మార్గములోనికి మరల్చుకొన్నచో ఆశీర్వాదకరముగా నుందువు.

క్రిస్మస్ మనకు నూతనమైన మార్గమును చూపించును అది ఆశీర్వాదకరమైనది. అందులో ఉన్న ఆశీర్వాదము ప్రజలకు రాజులకు తెలియదు. ఇది శ్రేష్టమైనది, ప్రభువును ఆరాధించే మార్గము. ఈ మార్గములో ప్రయాణిస్తున్న మనము స్వచిత్తమును ప్రక్కనపెట్టినట్లయితే అది ప్రజలందరికి దీవెనకరముగా ఉండును. మీ జీవితకాలమంతా ప్రభువు మిమ్మును నడిపించే మార్గములో నడచి మీరు మీ కుటుంబములు సుఖసంతోషములతో సమాధానముతో దీవెనకరముగా ఉండవలెనని కోరుకొనుచున్నాను.

**- ఎడిటర్**

# కుమారుని ముద్దుపెట్టుకొనుడి

**దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను యోహాను 3:16.**

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. లోకములోనున్న మానవులెవ్వరును నశింపక నిత్యజీవమునకు వారసులవుటకుగాను ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను. కృపా సత్యసంపన్నుడును రక్షకుడునైన ఆ ప్రభువు ఈ లోకమందు నరునిగా జన్మించిన దానికి గురుతుగా ప్రపంచమంతటను క్రిస్మస్ దినమును జరుపుకుంటున్నారు. క్రిస్మస్ అనగా సంబరాలు, బహుమతులు, వేడుకలు, క్రొత్త వస్త్రాలు, నక్షత్రాలు అని చాలామందికి గుర్తుకొస్తాయి. అయితే దేవాతిదేవుడు నరునిగా ఈ లోకానికి దిగివచ్చిన ఉద్దేశం ఎంతో ఉన్నతమైనది.

ఈ లోకములో ఎవరును నశించుట పరలోకమందున్న తండ్రి చిత్తము కాదు, గనుక ఆయన తన అద్వితీయ కుమారుని ఈ లోకమునకు బహుమతిగా పంపించెను. ఈయన కన్యక గర్భమున జన్మించి తన జీవితమంతా పాపములేకుండా జీవించి నరులకు నిత్యజీవార్థమైన మార్గము చూపించెను. అద్వితీయ కుమారుడైన క్రీస్తునందు విశ్వాసముంచువారు నశింపక నిత్యజీవమునకు వారసులగుదురు. క్రీస్తు ఈ లోకమునందు జన్మించిన దినమైన ఈ క్రిస్మస్‌కు నీవు ఏమి పొందుకుంటున్నావు? నీ జీవితములో దేవుని ఉద్దేశం నెరవేర్చబడాలంటే ఆ అద్వితీయకుమారుడైన క్రీస్తు అధికారమునకు ఆధిపత్యమునకు నీవు అప్పగించుకొనవలెను.

**"కుమారుని ముద్దుపెట్టుకొనుడి"** కీర్తన. 2:12. ప్రియమైన దేవుని బిడ్డలారా, కుమారుని ముద్దుపెట్టుకొనుమని దేవుని వాక్యం సెలవిస్తుంది. కుమారుడు అనగా ప్రభువైన యేసుక్రీస్తు. ముద్దుపెట్టుకొనుట అనగా ఆయన అధికారమునకు అప్పగించుకొనుట.

పరిసయ్యులలో ఒకడు తనతో కూడ భోజనము చేయవలెనని ఆయననడిగెను ఆయన ఆ పరిసయ్యుని యింటికి వెళ్లి భోజన పంక్తిని కూర్చుండగా

ఆ ఊరిలో ఉన్న పాపాత్మురాలైన యొక స్త్రీ యేసు పరిసయ్యుని యింట భోజనమునకు కూర్చున్నాడని తెలుసుకొని యొక బుడ్డిలో అత్తరు తీసుకొని వచ్చి వెనుకతట్టు ఆయన పాదముల యొద్ద నిలువబడి ఏడ్చుచు కన్నీళ్ళతో ఆయన పాదములను తడిపి తన తలవెండ్రుకలతో తుడిచి ఆయన పాదములను ముద్దుపెట్టుకొని ఆ అత్తరు వాటికి పూసెను లూకా 7:36-38.

పాపాత్మురాలైన స్త్రీ ప్రభువైన యేసునందు విశ్వాసముంచినది. ఆయనను విస్తారముగా ప్రేమించి ఆయన పాదములను ముద్దాడినది. అత్తరు బుడ్డివలె తన హృదయము కూడా పగిలిపోయినది గనుక ఆమె విస్తారమైన పాపములు క్షమించబడినవి. పాపాత్మురాలైన స్త్రీని పరిసయ్యులు తమ యింటిలోనికి సాధారణముగా రానివ్వరు కాని ఆమెలో దేవుని సేవించాలనే ఆసక్తి తనకున్న ఆటంకాలను బద్దలు చేసింది. తన హృదయములో క్రీస్తుని ప్రభువుగా ప్రతిష్టించుకొని ప్రభువు యొక్క అధికారమునకు ఒప్పుకొని తన మనస్సు, తన నడక, తన దిశను మార్చుకొన్నది. అప్పటివరకు లోకాధికారములో ఉన్న ఆమె అప్పటినుండి ఆయన అధికారములోనికి వచ్చినది.

ఆమె తన జీవితంలో సామాజికంగా ఉన్న స్థితిగతులను ఆలోచించలేదు. కాని తన యొక్క పాపరోగము గురించి అవిధేయత, గర్వము, అపవిత్రత అనే రుగ్మతలను తలపోసికొనుచు వాటన్నింటిని ప్రభువు సన్నిధిలో ఒప్పుకొని తన జీవితముపై క్రీస్తుయొక్క నూతన అధికారమునకు సూచనగా ఆయన పాదములను ముద్దాడినది. పరిసయ్యుడైన సీమోను ప్రభువును ఆహ్వానించాడు కాని ఏ ఆశీర్వాదము పొందుకొనలేదు. పాపాత్మురాలైన స్త్రీ ఆయనను ఆహ్వానించకపోయినను గొప్ప ఆశీర్వాదం పొందుకొన్నది. ఆమె ప్రభువును విస్తారంగా ప్రేమించినది గనుక ప్రభువు ఆమె విస్తారమైన పాపములు క్షమించి నిజమైన శాంతిని సమాధానమును అనుగ్రహించెను.

ప్రియమైన దేవుని బిడ్డా! లోబడుటకు దేనికి మిమ్మును మీరు అప్పగించుకొందురో దానికే దాసులమగుదుమని మీరెరుగరా? రోమా6:16. ఇంకనూ నీవు పాపమునకే దాస్యత్వం చేయుచున్నావా? లేక నీ జీవితముపై నీ ప్రవర్తన అంతటిలో క్రీస్తు అధికారమునకు ఒప్పుకొనుచున్నావా? అక్రమము

చేయుటకై అపవిత్రతకును అక్రమమునకును మీ అవయవములను ఏలాగు అప్పగించితిరో అలాగే పరిశుద్ధత కలుగుటకై ఇప్పుడు మీ అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి రోమా 6:19.

ప్రభువును నీవు పెదవులతో ఆరాధిస్తున్నావా లేక హృదయమంతటితో ఆరాధించుచున్నావా? దేవుని ప్రేమ ఇంకను గ్రహించక కోట్లమంది కాలగర్భములో కలసిపోవుచున్నారు. దేవుని బిడ్డా ఎన్నో క్రిస్మస్ అనుభవాలు నీవు కలిగియుండవచ్చును. కాని క్రీస్తునందు నిజమైన విశ్వాసం లేకుండా నిత్యజీవమును ఏవిధంగా పొందుకొనగలవు? ఒక్కసారి నీ జీవితము గురించి ఆలోచించుము. ఎన్ని సం॥లు గతించిపోయినవి క్రీస్తు ప్రభువును క్రిస్మస్ చెట్టులోనో లేదా నక్షత్రములలోనో బంధించుచున్నావు కాని హృదయములో దేవునికి చోటిచ్చుటలేదు. ప్రభువు ఒక చెట్టుకో, ఒక నక్షత్రమునకో పరిమితము కాదు. ఆయన సర్వంతర్యామి ఆత్మస్వరూపియైన దేవుడు.

ప్రియమైన దేవుని బిడ్డలారా ! ప్రభువు లోక రక్షకునిగా ఈ లోకమునకు వచ్చిన ఉద్దేశము నీ జీవితంలో నెరవేరవలెను. నీవు దేవునియందు విశ్వాసముంచి పాపాత్మురాలైన స్త్రీవలె నీ పాపమును ఒప్పుకొని విడిచిపెట్టి లోక అధికారములో నుండి విడుదలపొంది క్రీస్తు అధికారమునకు అప్పగించుకొనుము. అప్పుడు ఇహమందు నిజమైన సంతోషము సమాధానము కలిగి నిత్యజీవమునకు వారసులు అగుటకు పరిశుద్ధాత్మ దేవుడు నీకు సహాయము చేయును గాక!


**మా వద్ద లభించు పుస్తకములు**

**దేవుడు టిబెట్ భాష మాట్లాడెను**
**ఉజ్జీవం ఎందుకు ఆలస్యమవుతుంది?**
**ఉజ్జీవ ప్రార్థన**
**దేవుని మార్గములో ఉజ్జీవం**
**ఆత్మీయతకు బలమైన పునాది**
**సొదొమకు బైబిలు లేదు**
**శ్రేష్ఠమైనది**
**ప్రార్థనా సంపద**

# ఫ్లారెన్స్ నైటింగేల్

ఫ్లారెన్స్ నైటింగేల్, చరిత్రను మార్చివేసిన గొప్ప స్త్రీలలో ఒకరు. ఈమె విలియమ్ నైటింగేల్ మరియు ఫానీ నైటింగేల్ దంపతులకు 1820 మే 20న జన్మించారు. వారు ఇంగ్లాండుకు చెందినవారు అయినను ఫ్లారెన్స్ మరియు తన అక్క పార్తెనోప్ ఇద్దరు ఇటలీలో జన్మించారు దానికి గుర్తుగా నేడు ఇటలీ దేశంలో ఒక అందమైన నగరానికి ఫ్లారెన్స్‌పేరు పెట్టబడినది. ఫ్లారెన్స్ తండ్రి విలియమ్స్‌ది సంపన్న కుటుంబం. ఇంగ్లాండ్ దేశములో లీహార్ట్ పట్టణములో 15 బెడ్‌రూమ్స్ గల ఒక గృహము కలదు అది కేవలం శీతాకాలములో ఉపయోగించేవారు. అది సరిపోదని విలియమ్ యంబ్లే పార్క్ అనే పట్టణములో వేసవికాల నివాసం కొరకు మరొక ఇంటిని కొనుగోలు చేసెను వారు శీతాకాలములో లీహార్ట్‌లోను వేసవి కాలములో యంబ్లే పార్క్‌లోను నివసించేవారు. విలియమ్స్ కుటుంబమునకు బంధువులు ఎక్కువ, ఎప్పుడు అందరు కలసి కుటుంబ విందులు ఏర్పాటు చేసుకొనేవారు.

**<u>బాల్యము :</u>** ఫ్లారెన్స్ బాల్యము ఎంతో అసంతృప్తిగా ఉండేది ఎంత సంపద ఉన్న బంధువులు ఉన్న ఆమె హృదయములో ఏదో కొరత ఉండేది. ఆమె చిన్న వయస్సులో తన తల్లితో పాటు లీహార్ట్ లోని వారిఎస్టేట్‌లో పనిచేసే పనివాళ్ళ కుటుంబాలను దర్శించడానికి వెళ్ళినది అవసరతలో ఉన్న కుటుంబాలకు కూరగాయలను పంచి వచ్చినప్పుడు ఎంతో తృప్తిని అనుభవించేది. పేద బాలలకు గంజిని ఇచ్చినప్పుడు హృదయములో చెప్పలేనంత ఆనందమును అనుభవించినది. ఒకసారి ఆమె బాల్యములో **6** సం॥ల వయస్సులో విహారానికి వెళ్లినప్పుడు ఒక రైతు యొక్క కుక్క గాయపడి కాలు విరిగిపోగా తాడు తెచ్చి వ్రేలాడదీస్తే దాని నొప్పి నుండి విడుదల పొందుతుందని రైతు తలంచాడు. అది చూచిన ఫ్లారెన్స్ అలాగు చేయవద్దు అని చెప్పి ఆ కుక్కను సమీపించి దాని గాయములను కడిగి వేడి నీటితో కాపు పెట్టగా ఆ కుక్క ఉపశమించినది. ఫ్లారెన్స్ ఎంతో విజయోత్సాహముతో నీ తాడు క్రింద పడవేయి దాని అవసరం ఇక లేదు నీ కుక్క కోలుకుంటుంది అని చెప్పినది.

ఫ్లొరెన్స్ తండ్రి విలియమ్స్‌కు తన కుమార్తెలిద్దరినీ అత్యున్నత చదువులు చదివించాలని ఆశ. ఆమెకు **12** సం॥ల వయస్సులో తండ్రి ఇంటిలోనే తరగతి గదిని లైబ్రరీని ఏర్పాటు చేసి తానే స్వయంగా లాటిన్, గ్రీకు, ఇటాలియన్, జర్మన్, మ్యాథ్స్, చరిత్ర తత్వశాస్త్రం బోధించేవాడు. ఫ్లొరెన్స్ చదువులో ఎంతో ఆసక్తిని కనపరచేది, అన్నింటిలో ముందుండేది. ఆమె **16** ఏండ్ల వయస్సులో (ఫిబ్రవరి7, 1837) న ఉదయకాలం దేవుని స్వరమును విని "దేవుడు తన సేవకు నన్ను పిలుచుచున్నానని నాతో మాట్లాడాడు" అని తన డైరీలో వ్రాసుకున్నది. అప్పటినుండి దేవుని కొరకు ప్రత్యేకమైనదేదో చేయాలని ఆమె కోరిక. అయితే ఏమి చేయాలో ఆమెకు తెలియదు.

ఆమెకు యుక్త వయస్సు వచ్చినప్పుడు తండ్రి ఆమెకు ఉన్నతమైన రాజకీయవేత్త రిచార్డ్‌తో వివాహం చేయాలని తద్వారా ఆమెలో ఉన్న విచారమును తీసివేయాలని తలంచెను. ఆమె దానిని వ్యతిరేకించలేదు గాని వివాహం చేసుకొంటే గృహానికే పరిమితమై తన జీవితంలో దేవుని ఉన్నతమైన పిలుపుకు తగినట్లుగా జీవించలేనని 30 సం॥ల వయస్సులో వివాహము అనే ఆలోచనను తన హృదయములో నుండి కొట్టివేసినది. తన భవిష్యత్తును గూర్చి ఆలోచించినప్పుడు తన చిన్ననాడు పేదలకు రోగులకు సేవచేసినప్పుడు కలిగిన ఆనందం ఆమెకు ఎంతో తృప్తినిచ్చినదని గ్రహించి పేదలకు, రోగులకు సేవచేయుటకు గాను నర్సింగ్ వృత్తిని ఎన్నుకొనాలని నిర్ణయించుకొన్నది.


**సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన**

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి **9.00** గం॥ల నుండి ఉ॥**5.00** గం॥ల వరకు

# శ్రద్ధ - ఐశ్వర్యము

**"వారు తమ తండ్రియైన రగూయేలు నొద్దకు వచ్చినప్పుడు అతడు - నేడు మీరింత త్వరగా ఎట్లు వచ్చితిరనెను" నిర్గమ. 2:18.**

మిద్యాను యాజకునికి 7గురు కుమార్తెలు ఉన్నారు. వారు వచ్చి తమ తండ్రి మందలకు నీళ్లు పెట్టుచుండగా మందకాపరులు వారిని తోలివేసిరి. అప్పుడు మోషే ఆ యాజకుని కుమార్తెలకు సహాయం చేసి మందలకు నీళ్లు పెట్టెను. తత్ఫలితంగా యాజకుని కుమార్తెలు త్వరగా ఇంటికి వెళ్ళిరి. యాజకుడైన రగూయేలు తమ కుమార్తెలతో మీరు ఇంత త్వరితముగా ఏలాగున రాగలిగిరని అడిగి సమాచారమంతయు తెలిసికొనెను.

**"శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును"** సామెతలు 10:4. రగూయేలు తన కుమార్తెల ప్రవర్తన విషయమై ఎంతో శ్రద్ధ కలిగియున్నాడు. ప్రతిరోజు వారు మందను తీసికొని బయటకు వెళ్ళేసమయమును ఎంతో జాగ్రత్తగా గమనిస్తూ ఉంటాడు మరియు వారు ఏ సమయానికి తిరిగి వస్తారో స్పష్టంగా యాజకునికి తెలుసు. యాజకుడు మందలు నీళ్ళు త్రాగినవా లేదా, మేత మేసినవా లేదా అనే దానిమీద కంటె తన కుమార్తెల ప్రవర్తన విషయమై శ్రద్ధ కలిగియున్నాడు. మనము అనేకసార్లు మన పిల్లలు ఎంత సంపాదిస్తున్నారు అని లెక్క చూస్తాము గాని వారి ప్రవర్తన గురించి ఆలోచించలేము.

మన పిల్లల ప్రవర్తన విషయమై శ్రద్ధ కలిగి ఉంటే ప్రవక్తలను, నాయకులను మన యింటికి ప్రభువు తీసికొని వస్తారు. రగూయేలు తన కుమార్తెకు వివాహం చేయవలసివచ్చినప్పుడు తానుగా ఎక్కడకు వెళ్లి వెదకలేదు గాని తన పిల్లలు ప్రవర్తన మీద మనస్సు పెట్టినప్పుడు దేవుడే ప్రవక్తయైన మోషేను తన గృహమునకు నడిపించెను.

ప్రియులారా! ఇవి చివరి దినములు కుటుంబ వ్యవస్థను అపవాది పాడుచేయుచున్నాడు. ఏదేను తోటలో నున్న ఆదామునుండి అపవాది కనుదృష్టి అంతా కుటుంబంమీదనే ఉన్నది. అది మనము ఎన్నడు మరిచిపోలేము. ఈ దినములలో కూడా అపవాది అదే పనిమీద ఉన్నాడు. మన పిల్లల ప్రవర్తన

విషయమై హెచ్చరిస్తూ వారిని జాగ్రత్తగా పెంచవలెను. అప్పుడే ప్రభువు యొక్క ఉద్దేశములు మన కుటుంబములలో మన బిడ్డల జీవితములలో నెరవేర్చబడును. నూతన సంవత్సరములోనికి త్వరలో అడుగుపెట్టబోవుచున్నాము. రగూయేలు వలె పిల్లల విషయమై ప్రార్థనా పూర్వకముగా జాగ్రత్త కలిగి యుందము గాక.

# సువార్త ఉజ్జీవ సభలు

## 2019 జనవరి

| | |
|---|---|
| **2,3,4** | **కరీంనగర్** (కరీంనగర్ జిల్లా)<br>సెయింట్ మార్క్స్ చర్చ్ గ్రౌండ్ |
| **5,6** | **మరిపెడ బంగ్లా** (వరంగల్ జిల్లా) |
| **7,8,9** | **మదిర** (ఖమ్మం జిల్లా)<br>సుశీల డిగ్రీ కాలేజి ప్రక్క గ్రౌండ్) |
| **10,11** | **దామరచర్ల** (నల్గొండ జిల్లా)<br>శాంతినికేతన్ హైస్కూల్ ఎదురు గ్రౌండ్ |

## కన్వెన్షన్ - 2019

స్థలము : **బుడంపాడు, గుంటూరు**

**ఏప్రిల్ 23 రాత్రి నుండి 26 మధ్యాహ్నం వరకు**

**సమయం: ఉ॥10.00 గం॥ల నుండి రాత్రి 6.30 ని॥ల వరకు**

# నీకు విరోధముగా లేచువారు నీపక్షపు వారగుదురు

**"నీకు విరోధముగా గుంపుకూడువారు నీపక్షపు వారగుదురు" యెషయా 54:15.** దేవునికి దేవుని బిడ్డలకు విరోధముగా లేచువారిని దేవుడు దర్శించి దేవుని వైపుకు త్రిప్పుకొనును. యెహోవా నామము బలమైనది ఆయన ప్రేమ శాశ్వతమైనది. ఆయన శత్రువులను ప్రేమించి, క్షమించి, తనకు విరోధముగా లేచినవారి కొరకు ప్రార్థించెను. ప్రభువు సిలువలో శ్రమలను అనుభవిస్తూ తండ్రీ వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము అని ప్రార్థించెను. ఎవరైతే నీతి కొరకు సత్యము కొరకు పవిత్రంగా బ్రతుకుతారో అపవాది వారికి విరోధముగా అనేక పరిస్థితులను కల్పించును. అయితే వాటన్నింటి మధ్య క్రీస్తుయేసునకు కలిగిన మనస్సు కలిగి విరోధులను ప్రేమించి వారి కొరకు ప్రార్థించినచో ఏదో ఒక దినం ప్రభువు వారిని మనకు అనుగ్రహించును. దేవునికి అసాధ్యమైనది ఏదియు లేదు. ఆయనయందు విశ్వాసముంచువానిని ఆయన ఎన్నడు సిగ్గుపరచడు.

అపొస్తలుడైన పేతురు మేడగది అనుభవము తరువాత దేవుని ఆత్మతో నింపబడి యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన ప్రవచనము యొక్క నెరవేర్పును, క్రీస్తు యొక్క సిలువ శ్రమలు, ఆయన యొక్క మరణ పునరుత్థానముల గురించియు ఆయనను శ్రమపెట్టి సిలువవేసిన యూదులకు ప్రకటించెను. పేతురు–మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలుసుకొనవలెనని చెప్పెను. వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని సహోదరులారా మేమేమి చేతుమని పేతురును, కడమ అపొస్తులులను అడిగిరి. అందుకు పేతురు మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు అని ప్రకటించెను అపొ. 2:36–38.

పేతురు ప్రకటన విన్నవారు క్రీస్తుకు విరోధులు, శత్రువులు, ప్రభువును అంగీకరించనివారైనను వారి హృదయాలలో దేవుని ఆత్మ కార్యము జరిగెను.

వారు మారుమనస్సు పొంది ఇంచుమించు మూడువేల మంది ఆది సంఘంలో చేర్చబడిరి. వీరు అపొస్తలుల బోధయందు రొట్టె విరచుటయందు ప్రార్థనచేయుటయందు యెడతెగక యుండిరి. దేవునికి విరోధముగా లేచినవారు దేవుని పక్షము చేరిరి. ప్రభువు వారిని ప్రేమించి క్షమించి రక్షణ భాగ్యమును అనుగ్రహించెను.

**యోసేపు :**

యోసేపు 17 ఏండ్లవాడై తన సహోదరులతో కూడా మందను మేపుచుండెను. అప్పుడు యోసేపు తన అన్నల యొక్క చెడు సమాచారమును తండ్రి యొద్దకు చేర్చుచుండువాడు. యాకోబు తన కుమారులందరి కంటే యోసేపును ఎక్కువగా ప్రేమించి అతనికి విచిత్రమైన నిలువుటంగీ కుట్టించెను. ఒకనాడు యోసేపు కల కని తన సహోదరులతో అది తెలియజెప్పగా వారు అతని మీద పగపట్టిరి ఆది.37:1-10. తండ్రి కూడా యోసేపును గద్దించెను ఈ కారణము చొప్పున యోసేపు సహోదరులు అతనిని నీరు లేని గుంటలో పడవేసి ఐగుప్తునుండి వచ్చిన ఇష్మాయేలీయులకు 20 తులముల వెండికి అమ్మివేసిరి. ఇష్మాయేలీయులు ఐగుప్తీయుడైన పోతిఫరుకు అతనిని అమ్మెను.

యెహోవా యోసేపునకు తోడై అతడు చేసినదంతయు సఫలపరచెను. అది చూచిన పోతిఫరు యోసేపు మీద కటాక్షముంచి తన ఇంటి మీద విచారణ కర్తగా నియమించెను. ఇలా యోసేపు పరిశుద్ధంగా నమ్మకముగా ఆ ఇంట ఉన్నప్పుడు అపవాది పోతిఫరు భార్య మనస్సు ప్రేరేపించి యోసేపు మీద చెడ్డ నేరము మోపగా పోతిఫరు యోసేపును చెరసాలలో వేయించెను. దాదాపు 13 సం॥లు యోసేపు చెరసాలలో ఉండెను. దేవుడు చెరసాలలో కూడా యోసేపుకు తోడైయుండగా చెరసాల అధిపతి అతని మీద కటాక్షము చూపెను. దేవుని కృప యోసేపుతో ఉండెను. యోసేపు ఎక్కడ ఉంటే అక్కడ దేవుని అదృశ్యహస్తం అతనితో ఉండి నడిపించెను. ఎంత విరోధంగా అపవాది తన సహొదరులను రేపెనో అంత అధికంగా దేవుడు యోసేపు జీవితమును ఆశీర్వాదకరముగా చేసెను.

ఆ తరువాత ఫరో కలలు కనెను వాటి భావమును ఐగుప్తులో ఎవరును చెప్పలేకపోయిరి. యోసేపు చెరసాలలో ఉన్నప్పుడు పానదాయకుల అధిపతికి కలిగిన మేలును జ్ఞాపకం చేసుకొని ఫరోకు ఆ సంగతి తెలిపెను. అప్పుడు ఫరో యోసేపును చెరసాలలో నుండి వెలుపలికి తీసికొని రాగా యోసేపు ఫరో యొక్క కలల భావమును తెలిపెను. ఫరో యోసేపుతో దేవుడు ఇదంతయు నీకు తెలిపెను గనుక నీవలె జ్ఞానవివేకములు గలవారు ఎవరును లేరు నీవే నా ఇంటికి అధికారివై యుండుము, నా ప్రజలందరు నీకు విధేయులై యుందురనెను. సింహాసనము విషయములో మాత్రమే నేను నీకంటె పైవాడనైయుందునని చెప్పి ఐగుప్త దేశమంతటి మీద యోసేపును అధికారిగా నియమించెను ఆది. 41:39-43.

యోసేపు ఐగుప్త అధికారిగా నియమింపబడెను. ఆ దేశమందు సమృద్ధిగా పంటపండిన 7 సం॥లు గడిచిన తరువాత కరువు ప్రారంభమాయెను. ఆ కరువు ప్రతి దేశమున భారమైనందున సమస్త దేశస్థులు యోసేపు నొద్ద ధాన్యము కొనుటకు ఐగుప్తునకు వచ్చిరి ఆది. 41:57. కరువు కనాను దేశములో ఉండెను గనుక యాకోబు తన కుమారులను ధాన్యము కొనుటకు రూకలు ఇచ్చి ఐగుప్తుకు పంపెను. వారు యోసేపు ముందు నిలువబడినప్పుడు యోసేపు వారిని గుర్తుపట్టి వారి తండ్రి యొక్క క్షేమసమాచారమును అడిగెను, వారు ధాన్యమును తీసుకొని వెళ్ళి యోసేపు సమాచారమును తండ్రికి తెలిపిరి. యోసేపు తండ్రియైన యాకోబు తన కుమారులందరిని ఐగుప్తునకు పంపించెను. దేవుడు యాకోబుతో నీవు ఐగుప్తునకు వెళ్ళుటకు భయపడకుము నేను నీతో కూడా ఐగుప్తునకు వచ్చెదను అని మాట్లాడెను.

యోసేపు ఐగుప్త సింహాసనము ఎక్కిన తరువాత యోసేపును ద్వేషించి అవమానపరచినవారు అమ్ముకున్నవారు గద్దించినవారు అందరు యోసేపు పక్షముగా చేరిరి. దేవుని కార్యములు ఎంత ఆశ్చర్యకరమైనవి! ఎవరు ఊహించని కార్యము దేవుడు యోసేపు జీవితంలో చేసెను. నీవు ఎటువంటి పరిస్థితులలోనైన తొట్రిల్లక, జడియక, బెదరక విశ్వాసంతో స్థిరంగా దేవుని కొరకు నిలబడుము. ప్రభువు నీకు తోడైయుండి నీవు చేయునదంతయు సఫలము చేసి నీకు విరోధంగా లేచువారిని నీ పక్షముగా చేర్చును. యోసేపును ద్వేషించిన వారు యోసేపు ప్రక్కన కూర్చొని

భోజనం చేసిరి. నీ ప్రవర్తన యెహోవాకు ప్రీతికరముగా ఉన్నప్పుడు శత్రువులు నీతో కలసి భోజనం చేస్తారు, మిత్రులై సాగిలపడతారు.

యోసేపు ఎన్నడు తన సహోదరుల మీద పగపట్టలేదు ద్వేషించలేదు. యోసేపు తన సహోదరులకు తనను తాను తెలియజేసికొని ఎలుగెత్తి యేడ్వగా ఐగుప్తీయులును ఫరో యింటివారును వినిరి. యోసేపు ఐగుప్తునకు వెళ్లునట్లు మీరు నన్ను అమ్మివేసినందుకు దుఃఖపడకుడి అది మీకు సంతాపము పుట్టింపనియ్యకుడి ప్రాణ రక్షణ కొరకు దేవుడు మీకు ముందుగా నన్ను పంపెను. కరువు దేశములో నున్నది సేద్యమైనను కోతయైనను లేని సంవత్సరములు ఇంక అయిదు వచ్చును. మిమ్మును ఆశ్చర్యముగ రక్షించి దేశములో శేషముగా నిలుపుటకును ప్రాణముతో కాపాడుటకును దేవుడు మీకు ముందుగా నన్ను పంపెను అని చెప్పెను ఆది. 45:5-7.

యాకోబు చనిపోయిన తరువాత యోసేపు తన సహోదరులతో నేను మిమ్మును మీ పిల్లలను పోషించెదనని చెప్పి వారిని ఆదరించి వారితో ప్రీతిగా మాట్లాడెను ఆది. 50:21. ఇటువంటి ప్రేమగల హృదయము మనమును కలిగి యున్నప్పుడు విరోధులు తిరిగి మన పక్షముగా వచ్చెదరు.

**అపొస్తలుడైన పౌలు :**

పౌలు సౌలుగా ఉన్నప్పుడు క్రీస్తుప్రభువును అంగీకరించక ధర్మశాస్త్రమునందు నిష్ఠాగరిష్టుడుగా ఉండి సంఘమును బహుగా శ్రమపరచెను. దమస్కులో ఉన్న పరిశుద్ధులకు విరోధంగా లేచెను. ఆశ్చర్యముగా సౌలు దమస్కులో అడుగు పెట్టి తిన్ననిదనబడిన వీధిలో యూదా అనువాని యింటచేరి ప్రభువు నామమున ప్రార్థించెను. అధికారుల వలన పత్రికలు పొంది ప్రభువు నామమున ప్రార్థన చేయువారిని బాధించుటకు బయలుదేరిన పౌలును ప్రభువు ఆత్మ బంధించెను. దమస్కులో పరిచారకులు సౌలు కొరకు ప్రార్థించెను.

ప్రభువు నామమునకు సంఘమునకు పరిశుద్ధులకు హానిచేయాలనుకున్న సౌలును దేవుడు దర్శించెను. సంఘమునకు విరోధంగా లేచిన వానిని ప్రభువు

బంధించి ఆకర్షించి విమోచించి అపొస్తలునిగా చేసెను. ప్రభువు కొరకు పానార్పణముగా సంఘము కొరకు ప్రాణము పెట్టువానిగా మారిపోయెను.

పరిశుద్ధులారా! సంఘంకొరకు ప్రార్థించండి చివరి దినములలో అపవాది బహుగా విజృంభించి దేవునికి, దేవునిబిడ్డలకు విరోధంగా అనేకులను రేపుచున్నాడు. దేవునికి మొరపెట్టండి ఎంత కఠినులనైనను ప్రభువు సిలువను హత్తుకొనునట్లుగాను జయోత్సాహముతో సిలువజెండా ఎగురవేయునట్లుగాను ఆయన చేయును. వారిని ప్రేమించి, ప్రార్థించి ఓర్పుతో దేవుని వాగ్దానము నెరవేర్పు కొరకు కనిపెట్టండి. నీకు విరోధంగా లేచువారిని ప్రభువు నీకు అప్పగించబోయే సమయం ఆసన్నమైనది.

పరిశుద్ధమైన ప్రార్థనలు కొట్టివేయబడవు అని ప్రభువు సెలవిచ్చుచున్నారు (యెషయా 62:7) కావలివాడు వేకువ కొరకు మేల్కొని కనిపెట్టునట్లుగా రేయైనను పగలైనను మౌనముగా నుండక మొరపెట్టుము. ఎటువంటి విరోధులనైనను ప్రభువు ఆత్మ స్వాధీనపరచుకొనును. మీరు మౌనముగా ఉండి ప్రభువు సన్నిధిలో కనిపెట్టండి.

**దానియేలు :**

దానియేలు షద్రకు, మేషాకు, అబేద్నెగో అనువారు బబులోనులో దేవుని కొరకు జీవించిరి. వారి భక్తి జీవితమునకు విరోధముగా అనేకమంది లేచిరి. దానియేలులో తప్పయినను, లోపమైనను కనుగొనలేకపోయిరి. ఈ దానియేలు అతిశ్రేష్ఠమైన బుద్ధిగలవాడు. దానియేలునకును అతని స్నేహితులకును విరోధముగా లేచి ముప్పది దినముల వరకు రాజు దగ్గర తప్ప మరి ఏ దేవుని యొద్దనైనను మానవుని యొద్దనైనను మనవి చేయకూడదు అని రాజశాసనములను పుట్టించిరి. దానియేలు సహోద్యోగులు అతనిపై అసూయతో శాసనము పుట్టించి ఈ రాజ శాసనమును తిరస్కరించిన వారు సింహాల గుహలో పడవేయబడుదురు అని హెచ్చరించిరి.

ఇట్టి శాసనము సంతకము చేయబడెనని దానియేలు తెలిసికొనినను అతడు తన యింటి పైగది కిటికీలు యెరూషలేము తట్టునకు తెరువబడియుండగా

అనుదినము ముమ్మారు మోకాళ్లూని తన దేవునికి ప్రార్థన చేసెను. దానియేలును చూచినవారు అతని మీద నేరము మోపి సింహాల గుహలో పడవేసిరి. దేవుడు దానియేలు పక్షముగా నుండి తన దూతను పంపి దానియేలుకు ఏ హాని కలుగకుండ సింహాల నోటిని మూయించెను. అప్పుడు రాజగు దర్యావేషు దానియేలు దేవుడే జీవముగల దేవుడని శాసనము పుట్టించెను. దానియేలుకు విరోధంగా లేచినవారును బబులోను రాజ్యములోని సకల ప్రభుత్వముల యందుండు నివాసులు దానియేలు ఆరాధించే దేవుని వైపు తిరుగవలెను మరి ఏ దేవుని ఆరాధించకూడదు అను శాసనము దర్యావేషు రాజు పుట్టించెను. షద్రకు మేషాకు అబేద్నెగోలను దేవుడు అగ్నిగుండములో నుండి బయటకు తీసుకొని వచ్చెను. అగ్ని వారికి ఏ హాని చేయలేదు.

ప్రియమైన దేవుని బిడ్డలారా! నీవు ప్రభువు కొరకు జీవించే వ్యక్తివి అయితే నీ నిర్ణయం బద్దలు కాకుండా దేవుని పిలుపునకు వెనుతిరుగక దేవుని ఆత్మ నడిపించే మార్గంలో నీవు నడిచినచో, దేవుని ప్రేమించి ఆయన ఆజ్ఞలు పాటించి ఉపదేశమునకు లోబడినచో నీపై ఎవరు నేరారోపణ చేయలేరు.

నీకు విరోధముగా లేచినవారు నీపక్షపువారగుదురు. సింహాలబోనైనను అగ్నిగుండములైనను చెరసాలలైనను ఏవి నీ భక్తి జీవితమును కదిలించలేవు, ఎంత మాత్రమును నీకు హాని చేయవు. నీకు విరోధంగా రూపించబడిన ఏ ఆయుధము వర్ధిల్లదు నీ మీద కోపపడినవారందరు సిగ్గుపడి విస్మయమొందెదరు (యెషయా 41:11). నీవు దేవుని పక్షముగా ఉంటే దేవుడు నీ పక్షంగా ఉండి కార్యము సఫలము చేయును. దేవుడు మన పక్షముగా ఉండగా మనకు విరోధి ఎవడు?

ప్రియమైన దేవుని బిడ్డలారా! ప్రభువును నమ్మిన నీ జీవితంలో నీవు ఎదుర్కొనే పోరాటములు యుద్ధములు శత్రుత్వము అన్నింటిలో దేవుని వైపు చూడుము. యోసేపువలె ప్రభువు మార్గంలో సాగి వెళ్ళండి. కొండలైన, లోయలైన, చెరసాలలైన, నిందలైన, అవమానములైన వెనుతిరుగక విశ్వాసముతో దేవునిమీద ఆనుకొని ఆత్మీయయాత్రలో అలసిపోక నిరుత్సాహపడక ధైర్యముతో దేవుని మీద

ఆనుకొని వాగ్దానములను స్వతంత్రించుకొని స్థిరచిత్తులమై ముందుకు సాగిపోతే ప్రభువు అన్ని విషయములలో జయము అనుగ్రహించి నీ ద్వారా తన నామమును మహిమపరచుకొంటారు. నేను యెహోవానై యున్నానని అన్యజనులు అనేకులు తెలిసికొనునట్లు నేను ఘనత వహించి నన్ను పరిశుద్ధపరచుకొని వారియెదుట నన్ను తెలియపరచుకొందును యెహెజ్కేలు 38:23.

ప్రియమైన దేవుని బిడ్డలారా! విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు యేసువైపు చూచుచు పందెములో ఓపికతో పరుగెత్తుదుము. మిమ్మును ముట్టినవాడు తన కనుగుడ్డును ముట్టినవాడు జెకర్యా2:8. దేవుని వాగ్దానములే మనకు ఆధారము నీవు నాదృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివి నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక నీకు ప్రతిగా మనుష్యులను అప్పగించుచున్నాను యెషయా43:4. నీ విరోధులను దేవుడు నీకు అప్పగిస్తాడు. నీ శ్రమలన్నింటిలో నుండి నిన్ను రక్షించి కాపాడును. శత్రువు భయము లేక దేవుని కృపమీద ఆనుకొనుము.

ప్రియులారా! నీ కుటుంబము, నీ రక్తసంబంధులు, నీ సహపనివారు నీకు విరోధంగా లేచినప్పుడు నీవు విశ్వాసివైనను, దేవుని సేవకునివైనను భయపడక దేవుని యందు విశ్వాసంతో ఈ వాగ్దానం స్వతంత్రించుకొనుము. ఈ సంవత్సరము చివరి దినములలో మనం ఉన్నాము నూతన సం॥ మన ముందు ఉన్నది గతసంవత్సరములన్నింటిలో నీకు విరోధముగా శత్రువు లేచినను నీవు విశ్వసించుము. శత్రువు నిన్ను చెదరగొట్టినను దేవుడు సమకూర్చగలడు.

చెదరగొట్టబడిన నీ జీవితమును నీ కుటుంబమును దేవుడు సమకూర్చి నీ జనుల మధ్య నిన్ను నివసింపజేయును. నూతన సంవత్సరములో ప్రభువు నూతన కార్యములను చేయును యేసుప్రభువు వలె శత్రువులను ప్రేమించి క్షమించినప్పుడు విరోధులు నీ పక్షము చేరునట్లుగా ప్రభువు నీ జీవితములో కూడ ఆశ్చర్య కార్యములు చేయును గాక!

# పరుల జోలికి పోకుండుట

నా కుమారుడా వట్టిగా ఆ యా సంగతులు తెలిసికొనుట కాశింపకుము వ్యర్థమైన చింతలచేత నిన్ను బాధపరచుకొనకుము. ఆ యా విచారణలతో నీకేమి పని? నీవు నన్ననుసరింపుము. ఏ మనుజుడెట్టివాడైన దానితో నీకేమి పని? వాడు అటువంటివాడు, వీడు యిటువంటి వాడు, వీడిట్లు చెప్పినాడు, ఇట్లు చేసినాడు, అను విషయములతో నీకేమి జోలి? నీవు ఇతరులకు ఉత్తరవాదివా? నీవు నీ విషయము మాత్రమే సమాధానమీయవలెను. ఇతర విషయములలో నీవెందుకు చిక్కుబడుదువు?

నేను ప్రతివాని నెరుగుదును ఆకాశము క్రింద జరుగు ప్రతి కార్యమును నేను చూచుచున్నాను. ఒకడెట్టి పరిస్థితియందున్నాడో యేమి తలంచుచున్నాడో దేని నాశించుచున్నాడో యే ఉద్దేశముతో నెట్టి కార్యము చేయుచున్నాడో యీ విషయములన్ని నేనెరుగుదును.

ఈ విషయములన్నిటిని నీవు నాకు వదిలిపెట్టి నీవు నిశ్చింతగల వాడవై యుండుము. ఇతరులు వ్యర్థముగా వీటియందు జోక్యము కలిగించుకొని తొందరపడుచుండిన యెడల తమ యిష్టప్రకారము వారిని తొందరపడనిమ్ము. వారు చేయునదంతయు చెప్పినదంతయు వారిమీదికి వచ్చును. నన్నెవడును మోసము చేయలేడు గదా !

గొప్ప పురుషుల మెప్పు పొందుటకు చూడకుము. గొప్పలకొరకు అనేకులతో స్నేహము చేయకుము. మానవులయొక్క ప్రత్యేకమైన అనురాగము కొరకు ప్రాకులాడకుము. ఇవన్నియు నీ హృదయమును దారితప్పించి మోహములో ముంచివేయును.

నీవు నా రాక కొరకు శ్రద్ధగా కనిపెట్టుకొనియుండి నీ హృదయ కవాటము నాకు తెరచినచో, నేను ఆప్యాయముగ నీతో మాటలాడి నా మర్మములను నీకు బయలుపరతును.

నీ చుట్టుప్రక్కలను గూర్చిన మెలకువ కలిగి ప్రార్థనయందు బహు జాగరూకుడవై అన్నిటియందు నిన్ను నీవు తగ్గించుకొనుము.

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2016-18

# యౌవనస్థుల కూటములు

స్థలము : హోలీమినిస్ట్రీస్ ప్రార్థన మందిరము

**బుడంపాడు, గుంటూరు**

తేదీలు : **2019 జనవరి 13** సా॥ నుండి **18** మ॥ వరకు

To,
Sri / Smt.

If undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : 9491475967, 9290901396

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 11th & 12th of Every Month